నీటిశుద్ధిపై నిర్లక్ష్యం!

ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే పథకాల నిర్వహణను కూడా గాలికి వదిలేశారు. ఆర్నెల్లుగా సమస్య ఉన్నా పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీంతో నీటి శుద్ధి అంతంత మాత్రంగానే సాగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే వడ్లపూడి వాసులకు తాగునీటి ఇక్కట్లు తప్పవు.


నీటిని శుద్ధిచేసే వాటర్ ప్లాంట్

సిద్ధార్థనగర్‌లో ప్లాంట్‌లో మూలకు చేరిన మోటార్లు

ఆర్నెల్లుగా సమస్య

పట్టించుకోని యంత్రాంగం

వేసవి కావడంతో తాగునీటి ఎద్దడి తప్పదని ఆందోళన


నీటిని శుద్ధి చేసిన తర్వాత సంపులోకి పంపించే బెడ్స్

కూర్మన్నపాలెం: వడ్లపూడి పరిసర ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు సిద్ధార్థనగర్ వద్ద నిర్మించిన మంచినీటి పథకం ఆదుకుంటుంది. అయితే నిర్వహణలోపం శాపంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో సక్రమంగా పనిచేసిన ప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టు నిర్వహణ గాడితప్పింది.

ఇదీ పరిస్థితి

వడ్లపూడిలోని జీవీఎంసీ 86,87వ వార్డుల్లో నివసిస్తున్న 30,000 వేల కుటుంబాలకు 15 వేల కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు సిద్ధార్థనగర్‌లో 12 ఎంఎల్‌డీ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా ఫకీర్‌తక్యా వద్ద కనక్టివిటీ ఇచ్చి 12 ఎంఎల్‌డీకి తరలిస్తారు. అక్కడ నీటిని శుద్ధిచేసి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. అయితే ఇందుకోసం ఆరు 40 హెచ్‌పీ మోటార్స్ అమర్చి వాటి ద్వారా పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం రెండు మోటార్లు మూలకు చేరాయి. రెండు 40 హెచ్‌పీ మోటార్స్, రెండు 28 హెచ్‌పీ మోటార్స్ మాత్రమే పనిచేస్తున్నాయి. దీని వల్ల ప్రజలకు సకాలంలో నీరు అందించలేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మోటార్ల మరమ్మతులు చేయడానికి ఇంతవరకు ఎవరూ పూనుకోలేదు.

ఎలా శుద్ధిచేస్తారంటే..

రిజర్వాయర్ ద్వారా వచ్చిన నీటిని ముందుగా ట్యాంకర్లలో నింపుతారు. అక్కడ అలం బ్రిక్స్ వేసి బ్రిడ్జిద్వారా కలిపి బెడ్స్‌లోకి పంపిస్తారు. బ్రిడ్జికూడా పనిచేయకపోవడటం వల్ల ఎలా వచ్చిననీరు అలా శుద్ధికర్మాగారంలో ఏర్పాటు చేసిన బెడ్స్‌కి చేరిపోతుంది. అక్కడ మాత్రమే ప్యూరిఫై చేసి సంపులోకి పంపిస్తారు. సంపు నుంచి వివిధ ప్రాంతాలకు పైపులైన్ ద్వారా అందిస్తారు. ఇందుకోసం 12 మంది సిబ్బంది రాత్రి పగలు పనిచేస్తుంటారు. అయితే మోటార్లు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల సంపునిండిపోతుంది. అన్ని మోటార్స్ పనిచేస్తే ఎప్పటికప్పుడు ప్రజలకు నీరు అందించడానికి వీలు ఉంటుంది. ఎలక్ట్రికల్ బ్రిక్స్ సరిగ్గా పనిచేయకపోవడంవల్ల కూడా అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.


మూలకు చేరిన మోటార్లు


నీటిని శుద్ధిచేయడానికి ఉపయోగించే అలం బ్రిక్స్

మేల్కోకపోతే నీటికి కటకట

అసలే ఎండలు మండుతున్నాయి. ఇలాంటి తరుణంలో అధికారులు మేల్కొని మోటర్లను వినియోగంలోకి తేవాలి. లేని పక్షంలో తాగు నీటికి కటకట తప్పదు. ప్రస్తుతం కుళాయిల నుంచి వస్తున్న నీరు సరిపోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ 12 మిలియన్ లీటర్ల నీరు సేకరించి శుద్ధిచేస్తేనే తాగు నీటి ఎద్దడికి చెక్ పెట్టవచ్చునని సిబ్బంది చెబుతున్నారు.


12ఎంఎల్‌డీ పంపుహౌస్ ఇదే

మరమ్మతులు చేయాలి



వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే 12 ఎంఎల్‌డీ పూర్తి స్థాయిలో పనిచేయాలి. అందుకు అనుగుణంగా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి ఏర్పాట్లు చేయాలి. లేకుంటే నీటి ఎద్దడి ఏర్పడుతుంది. తక్షణమే మూలకు చేరిన మోటార్లను వినియోగంలోకి తేవాలి.

– పి. ఆనంద్‌కుమార్, గణేష్‌నగర్

ఆర్నెల్లుగా సమస్య



పంపుహౌస్‌లోని పలు మోటార్లు 6 మాసాలుగా మూలన పడ్డాయి. వాటికి ఎందుకు మరమ్మతులు చేయించడం లేదో అర్థంకావడంలేదు. తక్షణమే అన్ని మోటార్లు పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే అన్ని ప్రాంతాలకు మంచినీరు సక్రమంగా అందుతుంది.

– మళ్ల సూరిబాబు, కూర్మన్నపాలెం

క్లుప్తంగా

ఘనంగా సీతారామ లింగేశ్వరాలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరామయ్య

కూర్మన్నపాలెం: వడ్లపూడిలోని సీతారామ లింగేశ్వరాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య హాజరై అభిషేకాలు చేశారు. ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్,వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందరాజులు, ఈశ్వరరావు, దానప్పలు పాల్గొన్నారు.

త్రిశక్తి దేవాలయ వార్షికోత్సవాలు ప్రారంభం


హోమం చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: త్రిశక్తి దేవాలయం, నవనాగ శక్తి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ 18వ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రముఖ పండితుడు అల్లవరపు బాలసుబ్రహ్మణ శర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, నవనాగ మండపారాధనతో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో నవనాగులకు పంచామృతాభిషేకం, సర్పసూక్త నాగ మూల మంత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం త్రిశక్తి అమ్మవార్లకు ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ట, మండపారాధన పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లను తిరువీధిలో ఊరేగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో భజనలు, కోలాటాలు చేశారు. ఉక్కునగరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తల్లిదండ్రుల చెంతకు కుమార్తె

అక్కిరెడ్డిపాలెం: పరీక్షలు సరిగా రాయలేదని ఇంటి నుంచి కుమార్తె వెళ్లిపోయిందని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు విద్యార్థినిని వెతికి పట్టుకుని మంగళవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా పుల్లల చెరువుకు చెందిన వెంకట పూజిత (18) పెదగంట్యాడలోని ఆమె బంధువుల ఇంట్లో ఉండి గాజువాకలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షలు సరిగా రాయలేదని మనస్తాపంతో ఆమె ఇల్లు వదిలి వెళ్లిపోయింది. దీంతో ఈ నెల 13న కుటుంబ సభ్యులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన గాజువాక ఎస్ఐ రాధాకృష్ణ దర్యాప్తు చేపట్టారు. అనకాపల్లిలో ఉన్నట్లు గుర్తించి ఆమెను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

రీసైక్లింగ్ సంస్థలను ప్రోత్సహించండి


వనంగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆచార్య రెడ్డి తదితరులు

ఎంవీపీకాలనీ: రోజు వారి జీవితంలో వినియోగించే ఉత్పత్తుల ను రీసైక్లింగ్ చేసి అందుబాటులోకి తెస్తున్న సంస్థలను ప్రోత్సహించాలని ఏయూ పర్యావరణ విభాగం మాజీ ఆచార్యుడు ఇ.యు.బి.రెడ్డి కోరారు. గ్లోబల్ రీసైక్లింగ్ డేను పురస్కరించుకుని మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రీసైక్లింగ్ ఉత్పత్తుల ద్వారా సమాజానికి కలిగే లబ్ధిని విద్యార్థులకు వివరించారు. రీసైక్లింగ్ ద్వారా సహజ వనరులను కాపాడడం, ఉద్గారాలను తగ్గించడం ద్వారా భావితరాలకు పర్యావరణాన్ని సురక్షితంగా అందించడం సాధ్యమవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో రీసైక్లింగ్ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న మొక్కల పెంపకం, దేశీయ పండ్ల గింజలను ఆరబెట్టి వనంగా చల్లడం వంటి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌బాబు

ఉక్కునగరం: రాష్ట్రంలోని హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు, ప్రధానకార్యదర్శి లింగాల రవీంద్రబాబు కోరారు. స్థానికంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖలో 920 మంది కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు రోడ్డున పడ్డారన్నారు. 22 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం వల్ల వారి జీవన పరిస్థితులు దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది 50 ఏళ్లు దాటిన వారు ఉన్నారన్నారు. వారు పలు రకాల కుటుంబ, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించడంతో మనోవేదనతో ఏడుగురు హెల్త్ అసిస్టెంట్లు మరణించారన్నారు. వారి ఇబ్బందులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

చల్లగ చూడు పైడిమాంబ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక గ్రామ ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి జాతరను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చల్లగ చూడు తల్లి అని వేడుకున్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డ గోవింద్, నక్కా రమణబాబు, కొలిపాక అప్పారావు, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలిపల్లిమ్మా... కరుణించమ్మా...


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి


అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కొలువైన పోలిపల్లిమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి ప్రసాద వితరణ గావించారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, నగర ప్రధానకార్యదర్శి సంంద్రాన సూకరాజు, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, వార్డు మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ హుస్సేన్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ధర్మకర్త గొంతిన రమాశంకర్, కమిటీ ప్రతినిధులు కాద సత్యారావు, ఎస్. ఆంజనేయులు, కాద గౌరీష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా పైడిమాంబ పండగ


కార్యక్రమానికి హాజరైన జనం


మాట్లాడుతున్న మంత్రి శంకరనారాయణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 11న ఉత్సవాలను ప్రారంభించారు. వారం రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంతో పాటు గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతిరోజూ సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఘటాలను భక్తులు దర్శించుకోవడంతో పాటు మొక్కలు చెల్లించుకున్నారు. పుసుపు, కుంకుమ కలిపిన నీళ్లతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. పైడిమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు ఆధ్వర్యంలో సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బుర్రకథథ, (రేలారేరేలా) రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర అనే పౌరాణిక నాటకాలు అలరించాయి. మంగళవారం అమ్మవారి పండగను పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలు, మంగళవాద్యాలు, బాణసంచా పేలుళ్లతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, తిప్పల వంశీరెడ్డి, నాయకుల బొడ్డ గోవింద్, కరణంరెడ్డి నర్సింగరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తాటికొండ కాశీ విశ్వేశ్వరరావు, పీత రమణ,బత్తిన నాగభూషణం, బత్తిన భానుకిరణ్, ఇందల సంతోష్ యండా కృష్ణ, గెద్దం రమణ, ఉమా, పల్లం గోపి, గొంప రామారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


పైడిమాంబకు పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి


పరసలో సందడి

సీఐఎస్ఎఫ్ ర్యాలీకి ఘన స్వాగతం


ఫొటోలు దిగుతున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది


ర్యాలీకి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం: సీఐఎస్ఎఫ్ సిబ్బంది సమృద్ధి సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్‌ర్యాలీ మంగళవారం కూర్మన్నపాలెం చేరుకుంది. ఈ ర్యాలీకి పలు పాఠశాలల విద్యార్థులు, స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీలోని పాల్గొన్న సభ్యులు ఉక్కు పోరాట దీక్షాశిబిరం వద్ద కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం శిబిరం ముందు ఫొటోలు గిగారు. ర్యాలీ ఎందుకు చేపడుతున్నారో వివరించారు. దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థల్లో భద్రత కోసం సీఐఎస్ఎఫ్ 1969 మార్చి 10వ తేదీన ఆవిర్భవించిందని వివరించారు. సుమారు 20 రాష్ట్రాల్లోని సంస్థల్లో అనునిత్యం భద్రత కల్పిస్తున్నామని వారు వివరించారు. ర్యాలీ అన్నవరం, అమలాపురం మీదుగా సాగుతుందని తెలిపారు. ర్యాలీకి సీనియర్ కమాండర్ మహమ్మద్ హనీఫ్ సారథ్యం వహించారు.

తీరుమారని ఆర్టీసీ


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద సర్వీసు రోడ్డులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులు


బస్సుల వల్ల సర్వీసు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

అక్కిరెడ్డిపాలెం: ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల తీరు మారడంలేదు. ఎన్ని విధాలుగా కట్టడి చేస్తున్నా ట్రాఫిక్ ఆంక్షలను బేఖాతర్ చేస్తున్నారు. మా ఇష్టం అన్నట్టు సర్వీసు రోడ్లలో బస్సులు మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. విశాఖ డెయిరీ నుంచి భెల్ సిగ్నల్ పాయింట్ వరకు సర్వీసు రోడ్డులో ఈ పరిస్థితి నెలకుంటుంది. భెల్ సిగ్నల్ పాయింట్‌ను అధిగమించేందుకు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు గాజువాక వైపు వెళ్లే మార్గంలో సర్వీసు రోడ్డు వైపు మళ్లిస్తున్నారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల మధ్యలో ఈ పరిస్థితి ఉంటుంది. వీరిని కట్టడి చేయడంలో ట్రాఫిక్ పోలీసులు సైతం చేతులు ఎత్తేశారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది.

క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చూపాలి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం తన కార్యాలయంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఆయన అభినందించారు. బెంగళూరు యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ మెన్స్ టోర్నమెంట్‌లో రన్నర్స్‌గా నిలిచిన ఏయూ క్రీడా జట్టును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండటం, పూర్తి సామర్థ్యాలను ప్రదర్శించడం ఎంతో ప్రధానమన్నారు.


బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

భవిత కేంద్రాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

సీతంపేట: దివ్యాంగ పిల్లలను మానసిక, సామాజిక అభివృద్ధిలో ముందంజలో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రాంగణంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సిబ్బంది, అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక బోధన విధానాలతో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఎంతమంది, వారెక్కడ శిక్షణ పొందారు, పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నారు అనే విషయాలను సర్వశిక్షా అభియాన్ పథకం ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా కో ఆర్డినేటర్ బి.గీతలను ఆయన అడిగి తెలుసుకున్నారు. హియరింగ్ ఎయిడ్స్, వీల్ చైర్స్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎంత వరకు ప్రవేశపెట్టగలిగారు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో ఇంక్లుసివ్ ఎడ్యుకేషన్‌ను ఏయే రూపాల్లో ప్రోత్సహిస్తున్నారు, కొత్త అడ్మిషన్లు ఎలా జరుగుతున్నాయో వివరాలు సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో భవిత కేంద్రంలో పిల్లలకు ఇస్తున్న శిక్షణ ఫలితాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని సమస్యలపై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

పూలు గుస గుసలాడేనని..



వసంతం.. ప్రకృతి సోయగం.. శోభాయమానం.. చూపరులను పరవశింపజేస్తోంది కదూ ఈ చిత్రం.. పూలు గుస గుసలాడేనని..అంటూ పాడుకోవాలని అనిపిస్తోంది కదూ.. వేసవిలో.. ఆకు రాలే సమయంలో.. చిగురు తొడిగేందుకు సిద్ధమైన వేళలో.. ఓ చెట్టు మాత్రం మొత్తం పూలతో అబ్బురపరుస్తోంది. అందమైన పూలతో కనువిందు చేస్తోంది.. ఒక్కసారి చూసిన వారు కళ్లు తిప్పుకోనీయడం లేదు. ఇంతకీ ఈ చెట్టు పేరు ఏంటంటే.. తబీబియో రోజియో. స్థానిక నడుపూరు గెద్ద వద్ద కనువిందు చేస్తోంది.. జీవీఎంసీ అధికారులు నాటిన మొక్క నేడు చెట్టుగా ఎదిగి.. అందమైన పూల సొగసుతో ఆకట్టుకుంటోంది.

–పెదగంట్యాడ

'భవన నిర్మాణ కార్మికుల చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ


జీవీఎంసీ గాంధీ పార్కులో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించిన ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చలో ఢిల్లీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో వివిధ రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు..అధికారం చేపట్టిన 9 నెలలైనా ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. భవనిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.